తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తిరుమలలో కూలిన భారీ చెట్టు

### కారు ధ్వంసం




తిరుమల, అక్టోబర్ 28(ప్రభాతవార్త ప్రతినిధి: ''మొంథా'' తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో మంగళవారం ఉదయం బాలాజీనగర్‌లో భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో దానికింద పార్కుచేసిన కారుపై పడటంతో ధ్వంసమైంది. అదే ప్రాంతంలో భక్తులు, స్థానికులు కూడా లేక పోవడంతో పెద్దప్రమాదం తప్పింది. కూలిన చెట్టును టిటిడి అటవీశాఖ అధికారులు గంటలోపే తొలగించారు.

## పంటలపై ఏనుగుల బీభత్సం



కల్లూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త: పులిచెర్ల మండలం గోపన్నగారిపల్లిలో పంట పొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించి పంటలను ధ్వంసం చేశాయి. రైతు సత్యనారాయణ శెట్టి పొలంలో సాగుచేసిన టమాటా, వరి అరటి పంటలను ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టం జరిగింది. ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తున్న సమయంలో ఏనుగులు పంటలపై దాడులు చేసి ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం కూడా నామమాత్రంగా ఇస్తున్నదంతో, రైతులు ఏమి చేయాలో తెలియక పంటలు సాగు వద్దు రా బాబు అని పరిస్థితి నెలకొంది. అటు ప్రభుత్వం గాని ఇటు ప్రజాప్రతినిధులు కానీ రైతుల బాధలను పట్టించుకొని వారే లేరని వాపోతున్నారు.

# స్తంభించిన జనజీవనం

### కూలుతున్న గుడిసెలు: ధ్వంసమౌతున్న రోడ్లు
### నిరాశ్రయులౌతున్న జనం - పరుగులు తీస్తున్న అధికారులు



నచ్చనేరిలో కూలుతున్నగుడిసెలు



కమ్మకొత్తూరులో రోడ్డు ధ్వంసం



చిన్న అంజిమేడులో మృతి చెందిన ఆవు

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 28 ప్రభాతవార్త శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో మొంథా తుఫానుతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నష్టాలు, కష్టాలు మిగులుతుండి.గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. తుఫాను హెచ్చరికతో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తున్నారు. ఏర్పేడు మండలంలోని సదాశివకోన ప్రాజెక్టు నిండినట్లు అధికారులు ధృవీకరించారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఆస్తి నష్టం,పశు నష్టం వాటిల్లుతుంది. ఈ నేపధ్యంలో నచ్చనేరి గ్రామంలోని గిరిజన కాలనీలో చిన్న తంబి ఇల్లు కూలి నిరాశ్రయుడయ్యారు. కుటుంబంతో సమీపంలోని పాఠశాలలో తలదాచుకుంటున్నారు. కాగా ఇదే గిరిజన కాలనీకి చెందిన నాగరాజు ఇల్లు గోడలు పాక్షికంగా కూలాయి. ఈ సంఘటనకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి వెంకటమునిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. మండలంలో చోటు చేసుకున్న సంఘటనలను ఎంపిడిఓ డాక్టర్ సౌభాగ్యం, తహశీల్దార్ ఎం.భార్గవిలు పర్యవేక్షిస్తున్నారు. కాలనీలో అన్ని పూరిగుడిసెలు, మట్టి గోడలు. దాంతో 26 కుటుంబాలను పాఠశాల వద్దకు చేర్చారు. సహాయ కార్యక్రమాలను చేపట్టినట్లు ఎంపిడిఓ సౌభాగ్యం వివరించారు. ఈ గ్రామానికి సంబంధించిన చెరువును తహశీల్దార్ భార్గవి పరిశీలించారు. ఇప్పటి వరకు అయితే ఇబ్బంది లేదు కాని రాత్రికి వర్షం కురిస్తే ఇబ్బంది అవుతుందని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి మండలంలో పరిస్థితి దయనీయంగా ఉంది. పలు గ్రామాలకు రాకపోకలకు కాలువలు అడ్డంగిం ఇబ్బంది కల్గిస్తున్నాయి. ఈదుల కాలువతో గిరిజన కాలనీకి వెళ్ళ పరిస్థితి లేదు. కాగా సున్నపు కాలువలో శ్రీకాళహస్తి,తొట్టంబేడు మండలాలకు రాకపోకలు స్తంభించాయి. కాగా కమ్మకొత్తూరు నాయుడు చెరువు కల్వర్టు వరద ప్రవాహాన్ని కొట్టుకుపోయి ప్రమాదకరస్థితిలో ఉందన్నారు. అలాకొత్తగా నిర్మించిన రోడ్డు వెడల్పులో చేపట్టిన నిర్మాణం వర్షానికి దెబ్బతిన్నది.ఏర్పేడు మండలం లోని చిన్న అంజిమేడు గ్రామంలో విద్యుత్ షాక్‌తో సుమారు రూ.75వేల విలువ కల్గిన ఆవు మృతి చెందింది. పొలం వద్ద మేపుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి ఆవు మృతి చెందింది. ఈ ఆవు గాండ్ల చిత్తనూరు గేతంకు సంబంధించినదని సమా చారం. గొట్టిపూడి దళిత,గిరిజన కాలనీలో పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నట్లు గుర్తించారు. తుఫాను రాత్రికి తీరం దాటే అవకాశం ఉండటం వల్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, ఏదైనా ప్రమాదం జరిగితే తమకు సమాచారం అందించాలన్నారు. టిడిపినాయకులు రాఘవులు యాదవ్, బోగారి, దశరథయ్యలు పర్యటించి పరిశీలించారు.

## భయపెడుతున్న "మొంథా"!

### లోతట్టు ప్రాంతాలు జలమయం

తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో తిరుపతినగరం పరిసరాల్లో ఎడతెరపి లేకుండా వాన కురుస్తోంది. మంగళవారం ఉదయం నుండి తిరుమల,తిరుపతితోబాటు పరిసరాల్లోని మండలాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుండి ఎడతెరపిలేని వాన కురుస్తుండటంతో కపిలతీర్థం,శివజ్యోతినగర్, తిలక్‌రోడ్డు, వివిమహల్‌రోడ్డు, కొర్లగుంట, లక్ష్మీపురం, ప్రగతినగర్, నారాయణపురం, కొత్తపల్లి,సంజయ్‌గాంధీకాలనీ, జీవకోన, సుభాష్‌నగర్, రైల్వేకాలనీ, ఎన్జీవోకాలనీ, చంద్రశేఖర్‌రెడ్డికాలనీ, కొత్తపల్లి, సుందరయ్యనగర్‌లో మురుగునీటి కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆర్టీసి బస్టాండ్,డిఆర్‌మహల్‌రోడ్డు ప్రాంతాల్లో వరదనీరు పొంగి రోడ్లుచెరువులను తలపింపజేశాయి.అండర్‌బ్రిడ్జిల వద్ద వరదనీరు నిల్వకుండా మోటార్లుతో పంపింగ్ చేస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలను తిరుపతి మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, కమిషనర్ మౌర్య వేర్వేరుగా అధికారులతో కలసి తనిఖీలు చేస్తున్నారు. నగరపాలక ఎస్ఇ శ్యామ్‌సుందర్, ఇంజనీర్లు తులసీకుమార్, గోమతి, ఆరోగ్య అధికారి యువఅన్వేశ్, డిఇలు రమణ, మహేశ్, లలిత, రాజు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య,సుమతితోకలసి తనిఖీలుచేశారు.



ప్రజలను అప్రమత్తంగా చేశారు. పారిశుధ్యం, డ్రైనేజీ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాలు, రోడ్లు వాటిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

### 'మొంథా' ప్రభావంతో

# విస్తారంగా వర్షాలు

**- పొంగి పొర్లుతున్న చెరువులు, వాగులు, వంకలు, కాలువలు**
**- వర్షాలతో పంటలకు భారీ నష్టం - 50 చెరువులకు గండ్లు**



కృష్ణాపురం జలాశాయంను పరిశీలిస్తున్న మొంథా తుఫాను పరిశీలన ప్రత్యేక అధికారి పిఎస్ గిరీషా.

చిత్తూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం కురిసిన వర్షాలకు చెరువులు, వాగులు, వంకలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 56 చెరువులకు గండ్లు పడ్డాయి. ఇందులో పది చెరువులకు పడిన గండ్లను ఇరిగేషన్ అధికారులు, స్థానిక రైతులు కలిసి పూడ్చారు. మిగిలిన చెరువుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా వుండటంతో వర్షాలు తగ్గిన అనంతరం చెరువులకు ఏర్పడిన గండ్లను పూడ్చనున్నారు. జిల్లాలో మంగళవారం నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో భారీ వర్షం నమోదు అయ్యింది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు జిల్లాలో ఎక్కడా ప్రాణనష్టం జరుగలేదు. అయితే భారీ ఎత్తున పంట నష్టం జరిగింది. వర్షానికి పంట కొల్పోయిన రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాలకు 10 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగి వుండవచ్చునని ప్రాథమిక అంచనా. ముంథా తుఫాను పరిశీలన జిల్లా ప్రత్యేక అధికారి పిఎస్ గిరీషా మంగళవారం నగరి మున్సిపాల్టీ కీలపట్టు బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టుల వద్ద నీరు అధికంగా పారుతున్న ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బంది ద్వారా పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. ప్రతి 6 గంటలకు ఒకసారి జిల్లా పరిస్థితిని సమీక్షించుకుని రాష్ట్ర స్థాయికి సమాచారం అందించడం జరుగుతున్నదన్నారు. అనంతరం కార్వేటినగరం మండలం కృష్ణాపురం ప్రాజెక్టును పరిశీలించిన పిఎస్ గిరీషా జలాశయంకు వచ్చే వరద నీటిని వృధా కానీయకుండా నిల్వ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కృష్ణాపురం ప్రాజెక్టు ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఈ నెలలోనే ఏడు సార్లు పూర్తిగా నిండిందని ఇరిగేషన్ అధికారులు పిఎస్ గిరీషాకు వివరించారు. ఇప్పుడు ఎనిమిదివ సారి విడుదల చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో నగరి అర్డీఓ అనుపమ, కార్వేటినగరం తహాసిల్దారు నాగరాజు, ఎంపిడిఓ విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

### రూ 25 కోట్లుతో కాణిపాకంలో

## టీటీడీ గెస్ట్‌హౌస్, కళ్యాణ మండపాలు

కాణిపాకం, అక్టోబర్ 28 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు 25 కోట్లు రూపాయల వ్యయంతో అతిథి గృహం, రెండు కళ్యాణ మండపాలను నిర్మించడానికి టీటీడీ పాలకమండలి తీర్మానం చేసింది. మంగళవారం తిరుపతిలో టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బిఆర్. నాయుడు అధ్యక్షతన ధర్మయకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాణిపాకం దేవస్థానం అభ్యర్థన మేరకు 25 కోట్లు రూపాయలతో కాణిపాకం దేవస్థానంలో ఒక అతిథి గృహం, రెండు కళ్యాణ మండపాలను నిర్మించడానికి నిర్ణయిస్తూ అందుకు సంభందించి నిధులను మంజూరు చేస్తూ టీటీడీ ఛైర్మన్ ప్రకటించినట్లు కాణిపాకం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరి జవహార్‌లాల్, కమీషనర్ రామచంద్రమోహన్,ఆలయఛైర్మన్ వి.సురేంద్రబాబులకు ఈఓ కె.పెంచల కిషోర్ దన్యవాదాలు తెలిపారు.

## పోలీసుల ఆరోగ్యమే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం : ఎస్పీ




చిత్తూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త: పోలీసు సిబ్బంది ఆరోగ్యమే ప్రజాస్వామ్యంకు రక్షణ కవచమని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పోలీసు వెల్ఫేర్ ఆసుపత్రిలో ఎస్పీ తుషార్ డూడి ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంస్మరణ వారోత్సవాలను అక్టోబర్ 21 నుండి నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా మంగళవారం అపోలో డాక్టర్లతో పోలీసు సిబ్బంది, విశ్రాంత సిబ్బంది, హోమ్‌గార్డులు, వారి కుటుంబసభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. పోలీసులపై వస్తున్న ఒత్తిడిని తగ్గించడానికి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోలీసు శ్వేద మహిళా బ్యారక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, పోలీసులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చిత్తపులి నరేంద్ర పాడల్, ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఎఎస్పీ ఆర్.శివానందకిషోర్, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, ఏఆర్ డిఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌భాషాలు, ఆర్ఐలు సుధాకర్, చంద్రశేఖర్, వీరేష్‌లు, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఆర్టీసీ బస్సులు ఢీ : 23 మందికి గాయాలు




పుంగనూరు అక్టోబర్ 28 ప్రభాతవార్త మంగళవారం ఉదయం పట్టణ పొలిమేరలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఒక బస్సు డ్రైవర్ కు కాలు విరగడంతోపాటు ఏఎస్ఐ తో సహా 23 మంది గాయపడ్డారు వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు నుంచి వస్తున్న పలమనేరు డిపో ఆర్టీసీ బస్సు ఏపీ జీరో త్రీ 2378 కి చెందిన డ్రైవర్ మస్తాన్ గూడూరుపల్లి సమీపంలో ఒక ట్రాక్టర్ ను ఓవర్టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే అదే సమయంలో ఎదురుగా పలమనేరుకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఓవర్టేక్ చేసే సమయంలో కాస్తంత వేగంగా వెళ్లడంతో ఎదురుగా వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో పలమనేరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ శ్రీధర్ కాలు విరగడంతో పాటూ, రెండు బస్సులలో మొత్తం 23 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. గాయాల పాలైన వారిలో పుంగనూరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ అస్వర్త నారాయణ కూడా ఉన్నారు. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం క్షతగాత్రులను 108 సహాయంతో సిఐ సుబ్బరాయుడు పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.నుజ్జయిపోయిన రెండు బస్సులను విడదీసేందుకు ట్రాక్టర్లను ఉపయోగించారు. సిఐ సుబ్బరాయుడుతో పాటు, ఎంవీఐ సుప్రియలు ప్రమాదానికి జరిగిన కారణాలను తక్షణమే రికార్డు చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని మదనపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. పలమనేరు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ మస్తాన్ దూకుడే ఈ ప్రమాదానికి కారణమని ప్రయాణికులు తెలిపారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ-ఇద్దరికి తీవ్రగాయాలు

### 30మంది ప్రయాణీకులు సురక్షితం



నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని కొప్పేడు వద్ద మంగళవారం మధ్యాహ్నం సత్యవేడు డిపోకు చెందిన సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సును ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ చంద్రారెడ్డి కాలు విరిగిపోయింది. కండెక్టర్ లోకేష్‌బాబుకి స్వల్పగాయాలు ఏర్పడినది. ఇదే సమయంలో బస్సులో సుమారు 30మంది ప్రయాణీకులు సురక్షితంగా బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో లారీ డ్రైవర్ అతివేగంతో నడపుతూ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందర భాగం పూర్తిగా దెబ్బతిన్నది. ప్రమాదంలో గాయపడ్డ వారిని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కారు, ద్విచక్రవాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### తమిళ స్మగ్లర్ అరెస్టు

భాకరాపేట అక్టోబరు 28 ప్రభాతవార్త : కారు, ద్విచక్రవాహనంతో సహా 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్ ను అరెస్టు చేసినట్లు భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. ఎర్రచందనం తమిళనాడుకు అక్రమ రవాణా అవుతోందని అందిన రహస్య సమాచారం మేరకు భాకరాపేట రేంజ్ అటవీ సిబ్బంది తో కలసి దేవరకొండ బీట్ పరిధిలోని భాకరాపేట తలకోన రోడ్డు మధ్యలో నవా క్వాలిటీ ఫుడ్ ఫ్యాక్టరీ సమీపంలో అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. యర్రావారిపాలెం మండలం ఉస్తికాయల పెంట, బసవన్న గారి పల్లి మీదుగా భాకరాపేట వైపు కారు వస్తోందని అన్నారు. అదుపులోకి తీసుకొని అందులోని తమిళనాడుకు చెందిన స్మగ్లర్ అజిత్ కుమార్ మురళి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. కారు, ద్విచక్రవాహనంతో సహా 8 ఎర్రచందనం దుంగలు అదుపులోకి తీసుకోవడం జరిగింది అన్నారు. కారు, ద్విచక్రవాహనం, ఎర్రచందనం తో సహా వాటి విలువ సుమారు 20 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ బి ఓ లు వై.రాజేష్ కుమార్, ఎం. సదాశివయ్య, సి. ప్రదీప్ చంద్, సి. రవి, జె.బి. నిఖిల్, డ్రైవర్ లు హెచ్. శంకర్, ఎన్. రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పదిరోజుల వైకుంఠద్వార దర్శనం



**-వేదవిశ్వవిద్యాలయం విసి సదాశివమూర్తి తొలగింపు**
**-రూ.25కోట్లతో కాణిపాకంలో కీలక అభివృద్ధిపనులు**
**-రూ.15,400 శాశ్వత ఉద్యోగులకు, రూ.7,535 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం**
**-స్థానిక సిబ్బందికి అదనంగా 10శాతం -టిటిడి ఛైర్మన్**

తిరుమల,అక్టోబర్ 28ప్రభాతవార్తప్రతినిధి: సాధ్యమైనంతమంది ఎక్కువమంది భక్తులకు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనం చేయించేందుకు ఇదివరకు లాగే పదిరోజులు వైకుంఠద్వార దర్శనానికి టిటిడి బోర్డు ఆమోదించింది.ధర్మప్రచారంలో భాగంగా గ్రామాల్లో భజన మందిరాలు నిర్మించాలని నిర్ణయించారు. తిరుపతి ఎస్వీవేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణీసదాశివమూర్తిని తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు.జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద యాత్రికుల వసతిసముదాయం, సామూహిక వివాహాలకు ప్రత్యేక హాళ్ళు నిర్మాణానికి 25కోట్లు రూపాయలు మంజూరుచేస్తూ ఆమోదించారు. ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తీర్మానిం చారు. బ్రహ్మోత్సవ బహుమానంగా టిటిడి శాశ్వత ఉద్యోగులకు 15,400 రూపాయలు , ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు 7,535రూపాయలు ఇవ్వాలని నిర్ణయించారు.తిరుమల,తిరుపతిలో సిబ్బందికి అదనంగా 10శాతం ఇవ్వాలని నిర్ణయం. మంగళవారం అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తల మండలి సుదీర్ఘ సమావేశం జరిగింది. ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సాయంత్రం మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్సిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవి తదితరులు పాల్గొన్నారు. టిటిడి వైద్యవిభాగంలో అన్ని ఆస్పత్రులను మరింతగా పారదర్శకంగా నిర్వహిచేందుకు ఒకే డైరెక్టర్‌క్రిందకు తీసుకురానున్నామన్నారు. ప్రస్తుతం బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌ను అన్ని ఆస్పత్రుల డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ అనుమతికి సిఫార్సు చేశారు. తిరుమలలో గదుల అద్దెటారిఫ్‌ను పరిశీలించి నివేదిక సమర్పించడానికి ఒక కమిటీని ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

## బంగాళాఖాత సముద్రంను పరిశీలిస్తున్న కలెక్టర్



వాకాడు, అక్టోబర్ 28, ప్రభాతవార్త తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో మంగళవారం వాకాడు మండలం తూపిలిపాలెం బంగాళాఖాతం సముద్రమును జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, స్పెషల్ సైక్లోన్ అధికారి అరుణ్ బాబు, డిఎస్పి గీతలు పరిశీలించారు. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే తప్ప ఇళ్లల్లోనే ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తుఫాను ముందస్తుగా ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉంచాలన్నారు, అవసరమైతే ఎన్‌డిఆర్ఎఫ్ అందుబాటులో ఉంటుందన్నారు. మండలంలోని కాజ్ వేల వద్ద అధికారి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీ, బాలిరెడ్డిపాలెం పొలికట్లను, పలు ఏరియాలో కాజ్ వేల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు, లోతట్టు ప్రాంతాలులో ప్రజలను సురక్షిత భవనాల్లో చేర్పించే విధంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, స్పెషల్ సైక్లోన్ అధికారి అరుణబాబు, గూడూరు డిఎస్పి గీత, తహాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్, సిఐ హుస్సేన్ సాహెబ్, సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.



## తిరుపతిలో కూలిన బస్టాప్

తిరుపతి,అక్టోబర్ 28ప్రభాతవార్త: మొథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం రాత్రి భారీ ఈదురుగాలులకు ఓ బస్టాప్ నేలకూలింది. నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ఈ బస్టాప్ ఒక్కసారిగా కూలింది. ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టంతప్పింది. అధికారులు అక్కడకు చేరుకుని కూలిన బస్టాప్‌ను తొలగించారు.



## తుఫాన్ నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**శాంతిపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శాంతిపురం తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తహశీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. పగలు,రాత్రి సమయాల్లో ఇద్దరు విఆర్వోలు, ఇద్దరు విఆర్ఎలు కంట్రోల్‌రూంలో విధులు నిర్వహిస్తారన్నారు. గ్రామాల్లో సైతం విఆర్వోలు ప్రజలనుఅప్రమత్తం చేసేలా తగుచర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా ఏదేని సమస్యలు వస్తే వెంటనే కంట్రోల్‌రూంకు 8985258849, 9515046512,7093533473,9852356584నెంబర్లకుసమాచారంఅందిం చాలని కోరారు.

## కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల్ని స్వాధీనం చేసుకోవాలి

– మండలమీట్‌లో వైఎస్సార్సీ ఎంపిటిసిలు!!



**శాంతిపురం, అక్టోబర్28ప్రభాతవార్త** మండల కేంద్రం శాంతిపుర ంకు కూతవేటు దూరంలో ప్రభుత్వ భూములను రెండుచోట్ల ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి లేఔట్లు వేసేందుకుప్రయత్నిస్తున్నారని ఎందుకు అధి కారులు పట్టించుకోలేదని వైకాపా ఎంపిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపిపి వసుంధర కోదండరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈసందర్భంగా భూఆక్రమణలపై తహశీల్దార్ ప్రకాష్‌బాబు స్పందిస్తూ తాను కొత్తగా విధుల్లోచేరానని పూర్తి విషయాలు తెలుసుకుని ప్రభుత్వ భూములు కాపాడుతామన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో ఇంకా 66 టీచర్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పలుపాఠశాలలకు ప్రహరీగోడలు నిర్మించాలని సభ్యులుకోరారు. 64పెద్దూరు పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాల వేళల్లో సెల్‌ఫోన్లతో కాలక్షేపంచేస్తున్నారని సర్పంచ్ రాధాకృష్ణ ఏర్కొన్నారు. ఏడోమైలులో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని ఎంపిటిసి ఆర్ముగం కోరారు. మామిడి తోటల్లో కలిమి కాయ చెట్లు నాటేందుకు హార్టీకల్చర్ ద్వారా హెక్టారుకు 30వేలు అ ందిస్తున్నట్లు హెచ్ఒ వింధ్య తెలిపారు. వర్షాల నేపథ్యంలోగ్రామాల్లో పారిశుధ్య పనులు విస్తృతం చేయాలని పిఎసిఎస్‌ఛైర్మన్ గోపాల్ కోరారు. ఎంపిడిఒ పిఆర్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు వస్తున్నాయని వర్షాలు తగ్గాక గ్రామాల్లో పనులుచేయిస్తామన్నారు. మూడు నెలలుగా ఉపాధిబిల్లులు రాలేదని సభ్యులు ఏర్కొన్నారు. ఎపిఎం శ్రీనివాసులు మాట్లాడుతూగ్రామాల్లో మహిళా రైతుసంఘాలు ఏర్పాటుచేస్తావ న్నారు. కాగా సమావేశంలో పిఎసిఎస్‌ఛైర్మన్ గోపాల్,ఎంపిటిసి ఆర్ముగం మధ్య అంగన్‌వాడీ కేంద్రం అంశంగా వాదోపవాదాలు జరిగాయి. పలువురు అధికారులు సమావేశానికి దుమ్మా కొట్టారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు,సర్పంచులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా యాదగుంట చెరువుకట్ట



**వి.కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మండలంలోని బైరుపల్లి పంచాయతీ యాదగు ంట చెరువు కట్ట ఇటీవల కురిసిన వర్షాలతో ప్రమాదకరంగా మారింది. చెరువుకట్ట మధ్య భాగం కొంతమేర కుంగిపోయి ఆయకట్టు పొలాల్లో పడింది. నీరుకిందకు రావడంతో చెరువు కట్ట ఎక్కడ తెగుతుందోనని రైతులు ఆందోళనచెందుతున్నారు. గ్రామానికి ఇటీవల తారు రోడ్డు నిర్మాణం చేశారు.అయితే గుత్తేదారులు కట్టపై రివిట్‌మెంట్ తొలగించి రోడ్డు వేయడంతో ఇలా జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలికి చేరుకుని కట్టనుపరిశీలించారు. కట్టకు గండి పడకుండా ఎక్సలేటర్లతో పనులు చేయించారు. ఇరిగేషన్ అధికారులు నీటి లీకేజ్ నివారణకు ట్రాక్టర్లలో మట్టి తరలించారు. తహశీల్దార్ ఉదయ్ సంతోష్, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు,సిఐ సోమశేఖర్‌రెడ్డి,ఎఇ స్వప్న చెరువు కట్టను పరిశీలించారు.

## యువకుడిపై అడవి పంది దాడి



**వి.కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మండలంలోని మద్దిమాకులపల్లి గ్రామ సమీపంలో పొలాల వద్ద పశువులు మేపేందుకు వెళ్లిన ఓ యువకుడిపై అడవిపంది దాడిచేసి తీవ్రంగా గాయపరచింది. గ్రామానికి చెందిన సుధాకర్ కుమారుడు శరత్ (25)మంగళవారం మధ్యాహ్నం పాడి పశువును మేపేందుకు అటవీ సమీపంలోని పొలాల వద్దకు వెళ్లగా ఓ అడవిపంది ఒక్కసారిగా అతనిపై దాడిచేసింది. కుటుంబీకులు,స్థానికులు శరత్‌ను చికిత్స నిమిత్తం వి.కోట ఆస్పత్రికి తరలి ంచారు.

## నడవలేని స్థితిలోని వ్యక్తికి వీల్ ఛైర్ అందజేత

రామకుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త



మండలంలోని కావలిమడుగుకు చెందిన వెంకటేశప్ప అనేవ్యక్తి నడవలేని స్థితిలో ఉండడంతో ఆనంద కుమార్ గౌడ్ అనేవ్యక్తి అతనికి వీల్‌ఛైర్‌ను ఉచితంగా అందించారు.కార్యక్రమంలో రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, బాబు, మంజునాథ్, శీనప్ప,సామప్ప పాల్గొన్నారు.

## పక్కాగా పారిశుద్ధ్య పనులు

– నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి – మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్



**చిత్తూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** చిత్తూరు పరిసరాల్లో భారీ వర్షాలు నమోదు అవుతున్న నేపథ్యంలో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పారిశుధ్యం, మంచినీటి సరఫరా, రోడ్లు విస్తరణ, లోతట్టు ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. నగర పరిధిలో పారిశుధ్య లోపం లేకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే వ్యాధులు ప్రబలే అవకాశం వుందని హెచ్చరించారు. అలాగే నీటి సరఫరా లైన్లను తనిఖీ చేసి ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. క్లోరినేషన్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలన్నారు. సబ్‌జైలు వద్ద నీటి నాణ్యతను కమీషనర్ పరిశీలించారు. అనంతరం కట్టమంచి–సాంబయ్యకండ్రిగ రోడ్డు, గాంధీ రోడ్డు వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం కమీషనర్ లిల్లీబ్రిడ్జి, సంతపేట లోతట్టు ప్రాంతాలను పరిశీలించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఇ వెంకటరామిరెడ్డి, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**చిత్తూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** చిత్తూరు కట్టమంచి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం కన్పించింది. కట్టమంచి చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలుతూ పైకి కన్పిస్తుండటంతో స్థానికులు ఈ విషయంను పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని మృతదేహంను చెరువు నీటి నుండి వెలుపలికి తీశారు. అప్పటికే మృతదేహం ఉబ్బివుండటంతో మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం చేతిలో తాయెత్తు వుండటం, వడుగు చేసి వుండటంతో మృతి చెందిన వ్యక్తి ముస్లింగా పోలీసులు గుర్తించారు. అయితే స్థానికంగా ఎవరైనా ఈ ముస్లీం వ్యక్తిని కొట్టి చెరువులో పడవేశారా! లేక ముస్లీం వ్యక్తి చెరువులోకి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా! లేక మృతి చెందిన వ్యక్తి ఇతర ప్రాంతానికి చెందిన వాడా! అనేది పోలీసులు తేల్చాల్సి వుంది.

## నిర్వాసితురాలికి రూ.50వేల చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

గంగాధర నెల్లూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త:

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పూరి గుడిసె కూలి నిర్వాసితురాలైన ముక్కలతూరు పంచాయతీ దళితవాడకు చెందిన రాజేశ్వరికి తక్షణ సాయం కింద 50 వేల రూపాయల చెక్కును మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వీఎం థామస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడటానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఈ భారీ వర్షాల కారణంగా నివాస గృహాలను కోల్పోయిన వారికి నూతన పక్కా గృహాలను మంజూరు చేయిస్తామని అలాగే గ్రామస్తులను కలసి ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాద స్థితిలో ఉన్నఆత్మకూరును మరువను మండల అధికారులతో కలసి సందర్శించి శశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ మనోహర్ గౌడ్ తాహసిల్దారు శ్రీనివాసులుని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఇ దయాసాగర్ రెడ్డి కార్యదర్శి కిరణ్ కుమార్ వీఆర్వో సుబ్రమణ్యం సర్వేర్ వాసు మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాసు పెనుమూరు మార్కెట్ కమీటి ఛైర్మెన్ కృష్ణమ నాయుడు పిసిఎస్ ఛైర్మెన్ మోహన్ నాయుడు నాయకులు శ్రీధర్ యాదవ్ హరీష్ యాదవ్ మాధవ నాయుడు జాన్ జగదీశ్వర్‌నాయుడుప్రభాకర్‌నాయుడుబాలకృష్ణలతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ సంస్కృత వర్సిటీలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ పై అవగాహన ర్యాలీ



**తిరుపతి విద్య, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** జాతీయ సంస్కృత వర్సిటీలో మంగళవారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం అడ్మినిస్ట్రేషన్ భవనంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులచే విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ర్యాలీని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటి వైస్‌చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి ఈ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ప్రాముఖ్యతను వివరించారు.అవినీతి రహిత సమాజ నిర్మాణమే ఈ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ముఖ్యోద్దేశ్యం అని,ప్రతి ఒక్కరూ భాధ్యత కలిగి సమాజహితం కొరకు పనిచేయాలని,విశ్వవిద్యాలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేసి కృషిచేయాలని వివరించారు.వర్సిటి అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ఆవశ్యకతను మరియు కర్తవ్యాన్ని వివరించారు.ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ డా.ఎ.చారుకేష్, అడిషనల్ కోఆర్డినేటర్గా డా.ఎ.శేఖర్ రెడ్డి వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో సి.ఇ ప్రొ.ఎ.సచ్చిదానంద మూర్తి, ఎ.సి.ఇ ఈశ్వరయ్య,పి.ఆర్.ఓ ప్రొ.వి.రమేష్ బాబు, ఎ.పి.ఆర్.ఓ డా.కనపాల కుమార్,విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డుపై నిలిచిన నీరు ప్రజలకు ఇక్కట్లు



**సదుం, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మెంత తుఫాన్ కారణంగా మండలంలో కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. గాగ్గేయ నది భారీ ఎత్తున జోరుగా ప్రవహిస్తోంది. ఇందులో భాగంగా చదుము నుంచి పొట్టెం వారి పల్లెకు జాండ్రపేట మీదుగా గతంలో సిమెంట్ రోడ్డు వేశారు. ఈ రోడ్డుకు పక్కన ఉన్న తూములు మూసుకుపోవడంతో వర్షానికి నీరు మొత్తం రోడ్డుపై నిలిచిపోయింది .అధికారులు స్పందించి తూమును రెడీ చేయాల్సింది గా ప్రజలు కోరుతున్నారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోలీసుల రక్తదాన శిబిరం

**పలమనేరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**



పోలీస్ సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా పలమనేరు ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పోలీసులు రక్తదాన శిబిరం నిర్వహించారు. పలమనేరు డివిజన్ పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, వి.కోట తదితర మండలాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ పోలీసులు సమాజంలో ప్రజలకు రక్షణ కల్పిస్తూ రక్తదానం చేయడం ఆనందదాయకమని దీని వల్ల ఎంతో మందికి ప్రాణదానం చేస్తున్నామని వివరించారు. సిఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది, ప్రధాన వైద్యాధికారి మమతారాణి, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట గంటావూరు కాలనీ వాసుల ధర్నా



**పలమనేరు టౌన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరు ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ ఏర్పాటై దాదాపు 20 ఏళ్ళు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేవని ఆరోపించారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని ఎమ్మెల్యే ఎవరో కూడా తమకు తెలియదని ఇటు వైపు కన్నెత్తి చూడడంలేదని తమ సమస్యలు పట్టించుకునే దిక్కులేదని ఆరోపించారు. మురుగునీటి కాలువలేవు, సిమెంటు రోడ్లు లేవు, వీధిలైట్లు లేవు, రాత్రిళ్ళలో చీకలి రాజ్యమేలుతోందని విమర్శించారు. ఇళ్ళ మధ్యలో చెట్లు పొదలతో నిండిపోయిందని పాములు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. వర్షాలకు వీధులన్నీ బురదమయ్యమయ్యాయని అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొందన్నారు, ఎన్నికల సమయంలో అదిగో ఇదిగో అంటూ చుక్కలు చూపించి ఓట్లు వేయించుకున్నారని గెలిచిన తర్వాత పట్టించుకునే వారు లేరన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కమీషనర్ కెవి రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## 31న మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**పలమనేరు టౌన్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** పలమనేరు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకరం ఈ నెల 31న నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం తెలుగుదేశం నాయకుడు కిషోర్‌గౌడు, మార్కెట్ కమిటీ సెక్రటరీ సంజీవ్ తదితరులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. గంగవరం మండలానికి చెందిన రాజన్న మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. దీంతో ఆయనతో పాటు పాలకమండలి డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారు.

## అభివృద్ధి పనులు వేగవంతానికి చర్యలు

ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకా ంత్



**కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త** గ్రామాల్లో అభివృద్ధి పనుల వేగవంతానికి తగుచర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్లశ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం మండలం పైపాళ్యం, గుడుపల్లె మండల ం కంచిబ ందార్ల పల్లి గ్రామాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్, కడ పి.డి.వికాస్ మర్మత్,ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్‌సురేష్‌బాబులు పర్యటించారు. ఈ గ్రామాలను సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి దత్తత తీసుకున్న విషయం విదితమే. పైపాళ్యం గ్రామంలో రచ్చబండ నిర్మాణపనులు త్వరలో ప్రారంభిస్తామని డా॥ కంచర్ల పేర్కొన్నారు.అలాగే చావిడి నిర్మాణంకు చర్యలు చేపడ్తామన్నారు. అలాగే కెబిపల్లి గ్రామంలోసైత ం ప్రజల సమస్యల పరిష్కారంకు చర్యలుచేపడ్తా మన్నారు. మిగతా అభివృద్ధి పనులు సైతం త్వరలోనే ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలాచూ స్తామన్నారు.కార్యక్రమాల్లో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కడ పిఎసి సభ్యులు రాజ్‌కుమార్, సుగుణమ్మ, వెంకటేష్, పార్టీ అధ్యక్షులు రాజగోపాల్,సుబ్బు, జనసేన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డిపల్లిలో నూతన డ్రైన్ల నిర్మాణంకు కృషి



**కుప్పం, అక్టోబర్28 ప్రభాతవార్త** మున్సిపల్ పరిధి ఏడవ వార్డు వడ్డిపల్లి గ్రామంలో నూతన డ్రైనేజీల నిరా ్మణంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు తీసుకుంటామని కడ పిఎసి సభ్యుడు రాజ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం వారుగ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్డు విస్తరణకు ఉన్న అవకాశాలు పరిశీలించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మాణిక్యం, నేతలు రాజేష్, కమల్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగికి రూ. లక్ష ఆర్థికసాయం



**కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త** స్థానిక ఆర్టీసీడిపోలో లీడింగ్ హ్యాండ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె బాషా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈనేపథ్యంలో కుప్పండిపో ఉద్యోగులు,సిబ్బంది బాషా ఆరోగ్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు సేకరించారు. ఈ నగదును మంగళవారం స్థానిక డిపో కార్యాలయంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం చేతుల మీదుగా బాషా కుటుంబీకులకు అందజేశారు. బాషా త్వరగా కోలుకోవాలని పిఎస్ఎం ఆకాంక్షించారు. ఉద్యోగులను ఈసందర్భంగా అభినందించారు. డిఎం టికె స్వామి, కడ సభ్యురాలు సుగుణమ్మ, నేతలు బలరాంమూర్తి,జయపాల్, కార్మికులు పాల్గొన్నారు.

## తెదేపా బలోపేతానికి కృషి చేయాలి



**కుప్పం, అక్టోబర్ 28 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం మండలంలో తెదేపా బలోపేతానికి నేతలు,కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ కోరారు. వానగుట్టపల్లిప ంచాయతీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయనమాట్లాడారు. ప్రతి నెలా సమా వేశం జరపడంతో పాటు నేతలు ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాల యాలకు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలన్నారు.నేతలు శ్రీనివా సులు, శివకుమార్, జెఎంసి మురళి,చెక్కునత్తం మణి, సంతోష్, రామచంద్ర,రిజ్వాన్, రవి,జకావుల్లా, అక్మల్, అప్పాజీ,బాబు,రఘు, గోవిందరాజులు, పళని పాల్గొన్నారు.

## చెక్కునత్తంలో ఉచిత రక్తపరీక్షల శిబిరం



**కుప్పం, అక్టోబర్28 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశానుసారం భవ్య సంస్థచే కుప్పంలో ప్రజలకు ఉచితంగా రక్తపరీక్షల శిబిరాలు నిర్వహిస్తున్న విషయం విదితమే.మంగళవారం అడవిముల కలపల్లిలో ప్రజల నుంచి రక్త నమూనాలు ే ఎకరించారు. 49 రకాల పరీక్షలునిర్వహించి ప్రజల ఆరోగ్య సమస్యలుగుర్తించి తగుచికిత్సలు అందించను న్నారు. ఈ సందర్భంగా తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి,వీఎస్ఎస్ ఛైర్మన్ కనకరాజు, గ్రామస్తులు సిఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ భూమిలో ప్రవేశిస్తే కఠినచర్యలు : తహశీల్దార్



**శాంతిపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త** కుప్పం – పలమనేరు జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఆవులకుంట భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ప్రకాష్‌బాబు పేర్కొన్నారు.మంగళవారం మండల సమావేశంలో వైకాపా నేతలు కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తున్నారని ప్రస్తావించారు. సమావేశం ముగిసిన అనంతరం తహశీల్దార్ ప్రకాష్ బాబు నేరుగా సంబంధిత ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్పటికప్పుడు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయించారు. ఈ భూమి 1.08సెంట్ల విస్తీర్ణంతో చెరువు పొరంబోకు స్థలంగా

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గువ్వల చొరవతో తప్పిన పెనుప్రమాదం

–యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణం



**చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) చొరవతో పెను ప్రమాదం తప్పింది. యుద్ధ ప్రాతిపదికన చెరువు మొరవలో కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేయడంతో ప్రమాదం తప్పింది. మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ తెల్లనీళ్లపల్లికి దగ్గరో ఎద్దలకుంట వుంది. మొంథా తుఫాను ప్రభావంతో కుంట నిండి మొరవ దశకు వచ్చింది. చెరువు మొరవ పోతే గ్రామానికి ప్రమాదమని గుర్తించిన తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి వెంటనే చెరువు వద్దకు చేరుకొన్నాడు. చెరువులో నుంచి మొరవను మళ్లింపుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొన్నాడు. వెంటనే కల్వర్టును నిర్మించి చెరువు మొరవనీటిని దిగువ ప్రాంతానికి సురక్షితంగా వెళ్ళేలా పనులు చేపట్టి పూర్తి చేశాడు. దీంతో రైతులు, ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.తేదేపానాయకులు ఓబుల్‌రెడ్డి, పవన్‌కుమార్, అర్జున్‌రాయల్, ముని, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బూరగపల్లి చింతలకుంటను సందర్శించిన అధికారులు



**చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లి వద్దగల చింతల కుంటను మండలస్థాయి అధికారులు సందర్శించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కుంట నీటితో నిండు కుండలా మారింది. అయితే మొరవ లేకపోవడంతో పక్కనే వున్న గ్రామానికి ఇబ్బంది జరుగుతుందన్న ఉద్దేశ్యంతో ఎంపిడిఓ లీలామాధవి, ఇరిగేషన్ డిఇఇ బాబూ రాజేంద్ర ప్రసాద్‌లు మొరవనీటిని తాత్కాలికంగా దిగువ ప్రాంతానికి తరలి వెళ్ళేలా చర్యలు తీసుకుకొన్నారు. ఆయకట్టు రైతులు రాజా రమేష్‌రాయల్, వెంకట్రెడ్డి తదితరుల సలహాల మేరకు కుంట నుంచి నీరు సురక్షితంగా బయటకు వెళ్ళే విధంగాపనులుచేపట్టారు.మొరవప్రాంతంలో కల్వర్టు నిర్మించేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## చేయి చేయి కలిపారు...చెరువు గండిని పూడ్చారు...!



**చౌడేపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** ఎవరో వస్తారనీ ఏదో చేస్తారని ఎదురు చూడకుమా అన్న జాతీనేత పిలుపునందుకొన్న గ్రామస్తులు గ్రామానికి సమీపంలోని చెరువుకు గండి పడగా అందరూ కలసి పూడ్చేసి శభాష్ అనిపించుకొన్నారు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ యర్రపల్లి గ్రామానికి సమీపంలోని ఎగువరేవులకుంట వర్షాల ప్రభావంతో పూర్తిగా నిండింది. చెరువు కట్ట బలహీనంగా వుండటంతో ఒక చోటు గండి పడింది. గుర్తించిన గ్రామస్తులు, ఆయకట్ట రైతులు శివశంకర్‌రాజు నేతృత్వంలో గ్రామస్తులు గండిని పూడ్చేశారు. అప్రమత్తంగా లేకుండా వుండి వుంటే గండిపడ్డ కుంటలో నుంచి మహరాజులకుంట, చిన్నరేవులకుంట మీదుగా కొండయ్యగారిపల్లి చెరువులోకి వరద ఉధృతంగా ప్రవహించేది. ఈ 3కుంటలు నిండితే కొండయ్యగారిపల్లి గ్రామానికి ప్రమాదం సంభవించి వుండేదని రైతులు పేర్కొన్నారు. సకాలంలో స్పందించిన ఎంపిడిఓ లీలామాధవి పంచాయతీ కార్యదర్శి శివయ్య, ఇరిగేషన్ డిఇఇ బాబూ రాజేంద్రప్రసాద్, శివశంకర్‌రాజులకు ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు భరోసాగా నిలిచిన తాసిల్దార్ రమేష్ బాబు



**పూతలపట్టు, అక్టోబర్ 28, ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక అధికారి పిఎస్ గిరీష్ ఆదేశాల సూచనలు మేరకు మొంథా తుఫాన్ కారణంగా ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తాసిల్దార్ రమేష్ బాబు పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వర్షపాతం నమోదును ఎప్పటికప్పుడు గ్రామ పరిధిలో ఉన్న వాగులు వంకలు ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి ఎటువంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వీఆర్వో వీఆర్ఏ ప్రజల్ని అప్రమితం చేసే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేస్తూ ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని తాసిల్దార్ ఆదేశించారు. అదేవిధంగా మండల ప్రజలకు తెలియజేస్తూ మరగబెట్టిన నీరును తాగాలి చిన్న పిల్లలకు మరగబెట్టి పాలు ఇవ్వాలి ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి.

పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసరావు



**సోమల, అక్టోబర్ 28 ప్రభాతవార్త** ఎడతెరిపిలేని వర్షాల వల్ల పశువులకు సీజనల్ వ్యాధులతోపాటు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందువల్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమల పంచాయతీ దళితవాడలో మంగళవారం ఉదయం పశువైద్యాధికారి చందన ప్రియ తో కలిసి పాడి రైతులతో ఆయన సమావేశమయ్యారు. వాగులు వంకలు ఉండే ప్రాంతానికి పశువులు తీసుకు వెళ్ళరాదని, నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట నీటిలో దిగరాదని ఆయన హెచ్చరించారు. మేకలు గొర్రెల పాకలో శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పశువైద్యాధికారి మారసాని చందన ప్రియ మాట్లాడుతూ గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నందువల్ల పశువులకు వేసే గడ్డి దాన ఆరబెట్టి వాటికి అందించాలని కోరారు. పశువులకు ముందు జాగ్రత్త గా నట్టల నివారణ మందు వేయాలని తెలియజేశారు. పశువులకు ఎలాంటి ప్రాణ నష్టం జరిగిన వెంటనే వైద్యశాఖ అధికా రులకు తెలియజేయాలని కోరారు. లైవ్ స్టాక్ అసిస్టెంట్ శివ. రవితేజ, సురేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి పోటీల్లో తవణంపల్లె బాలికకు నాలుగవ స్థానం



**తవణంపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** గంగవరం కస్తూర్బా గాంధీ బాలిక్క విద్యాలయంలో చదువు తున్న తవణంపల్లె మండలంకు చెందిన విద్యార్థిని బి.కీర్తన రాష్ట్రస్థాయి అండర్–19 అథ్లెటిక్స్ 200 మీటర్లు ఈవింట్లో నాలుగవ స్థానం సాధించింది. ఈనెల 21 నుండి 24 వరకు పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని పదవేజి(మహదేవి) ఏపీ ఆర్ ఎస్ బాలుర గురుకులంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి.ఇందులో అండర్–19 అథ్లెటిక్స్ 200 మీటర్లు ఈవింట్లో కీర్తన అద్భుత ప్రతిభ కనభరచి నాల్గవ స్థానం సాధించింది. తవణంపల్లె మం డలం మాధవరం గ్రామపంచాయతీ ఎం.బోయపల్లె గ్రామంలో సామాన్య మధ్య తరగతి రైతు కుటుం బంకు చెందిన కీర్తన గంగవరం కస్తూర్బా బాలిక విద్యాలయంలో చదువుకుంటోంది. రాష్ట్రస్థాయి పోటీల్లో నాల్లబస్థానం సాధించిన కీర్తనను పాఠశాల హెచ్ఎం టి.రోహిణి, పీడీ అక్తర్‌లు పీఈటీలు అభినందించారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాలు అధికారులు తనిఖీలు

**సదుం, అక్టోబర్ 28 ప్రభాత వార్త** తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మండల అధికారులు మంగళ వారం పర్యటించి తనిఖీ నిర్వహించారు. బూరగు మంద పెద్ద చెరువు కట్ట పైన మట్టి కుంగడంతో ఆ మార్గంలో రాకపోకలను సరిదిద్దారు. అదేవిధంగా మొరవ వద్ద నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో జెసిబి తో చెత్తను తొలగించారు. అదేవిధంగా తిమ్మానయన పల్లి పంచాయతీ వ్యాసప్ప చెరువు నుండి మొరవ పోతున్న ప్రాంతాన్ని అధికారులు తనిఖీలు చేశారు. అనంతరం ఎంపీడీవో రాధా రాణి నడిగడ్డ సచివాలయాన్ని తనిఖీ చేసి తుఫానుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచనలు చేశారు.సదం ఎస్సై షేక్షావలి ,ఏఎస్ఐ సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో సచివాలయాల సిబ్బంది సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



## వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎంపీడీవో

**కల్లూరు, అక్టోబర్ 28, ప్రభాతవార్త** పులిచెర్ల మండ లంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను మంగళ వారం ఎంపీడీవో రాజశేఖర్ బాబు పరిశీలించారు. గ్రామాల్లో పర్యటించి, గ్రామస్తులకు తుఫాను జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులను చెరువులు వాగులు వంకల వద్దకు పంపరాదని సూచించారు. ఏదైనా ఆపద ఎదురైతే వెంటనే అధికారకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎంపీడీవో వెంట డిప్యూటీ ఎంపీడీవో హరి, కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

## పూరి గుడిసెపై కూలిన వృక్షం

బాధితులకు ఎంఎల్ఏ పరామర్శ

రామచంద్రాపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రామచంద్రాపురం, ఎస్టీ కాలనీలో మంగళవారం ఓ పూరి గుడిశె నేలమట్టమైంది. గుడిసెలో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఎంఎల్ఏ పులివర్తి నాని బాధితులు రోజా, రమేష్‌లను పరా మర్శించారు. బాధితులకు నిత్యవసర సరుకులు అందిం చాలని తహశీల్దార్ మధుసూదన్ రావును ఆదేశించారు. రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి నాయకులు చినబాబు, తినికొండ కేశవులునాయుడు, కొట్టే నరశింహారెడ్డి, కొట్టే గిరిధర్ రెడ్డి, కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్ర నాయుడు, లెక్కల మహేష్ నాయుడు, విజయ్‌కుమార్ రాయల్, విజయ్ కుమార్ రెడ్డి, సునీల్‌యాదవ్, మునిరామిరెడ్డి, జగదీష్, చెరుకూరి రవి, తదితరులు పాల్గొన్నారు.



## ఈదుల కాలువను పరిశీలించిన దేశం నాయకులు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** మోంథాన్ తుఫానుతో ముసార పట్టుకుంది. అలాగే గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండాయి. కాలువలు, వంకలు వాగులు పారుతున్నాయి. తుఫానుతో కొద్ది పాటి వర్షం కురుస్తుంది. దాంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశాలతో మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు పలువులు తెలుగుదేశం నాయకులు ముళ్ళపూడి గిరిజన కాలనీ, ఈదుల గుంటలను పరిశీలించారు. ఇక్కడ ప్రవాహం ఎక్కువగా ఉండటంతో జనం కాలనీ నుంచి బయటకు రాలేకోపోతున్నారని గుర్తించి ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. అధికారులకు ఎంఎల్ఏ సూచనలు చేస్తూ కాలనీలో సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. నీళ్ళు తగ్గి జనజీనం క్రమంగా కుదుట పడే వరకు వారికి ప్రభుత్వ సాయాన్ని అందించాలని సూచించారు. ఆయనతో పాటు తహశీల్దార్ జనార్ధన్‌రాజు, డిటిఅనిల్ ఎంపిడిఓ, ఇరిగేషన్ ఎఇఇ మండల అధ్యక్షుడు అక్షింతల కృష్ణాయాదవ్, యూనిట్ ఇన్‌చార్జి బత్తెయ్య తదితరులుపాల్గొన్నారు.

## పేదల అకలి తీర్చిన యువజన సంఘం



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని నవభారత యువజనసేవా సంఘం సామాజిక కార్యక్రమాల్లో ముందుంటుంది. ఈ నేపధ్యంలో మూడు రోజులుగా ముసురు కున్న ముసారతో భరద్వాజ తీర్థం సమీపంలోని గిరిజన కాలనీ వాసులకుపనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అంశాన్ని గుర్తించిన నవభారత యువజన సేవా సంఘం మంగళవారం వారి ఆకలి తీర్చుటకు భోజనాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలను సంఘం అధ్యక్షులు, న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు, న్యాయవాది గుమ్మళ్ళ రాజేశ్వరరావు, చిన్నబ్బా సభ్యులు పాల్గొన్నారు.

## వారాహి ఫార్మర్స్ ప్రోడ్యూసర్ ఫెడరేషన్ సమావేశం



**తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త**తొట్టంబేడు పార్మర్స్ ప్రోడ్యూసర్ కంపెని డైరెక్టర్ డాక్టర్ గుమ్మిడి పూడి దశరధాచ్చారి సారధ్యంలో మహారాష్ట్రలోని సేవా గ్రాం పట్టణంలోని వరద ప్రాంతంలోని మహాత్యాగాంధీఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రీ యలైజేషన్ నిర్వహించిన ఒక్కరోజు సదస్సుకు హాజర య్యారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఆయనతో పాటు పలువురు రైతుల్ని తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా అక్కడ సభలో గుమ్మడి దశరధాచ్చారి మాట్లాడుతూ ౦రైతులకు కావాల్సి నటువంటి పరికరాలు వారి ఉత్పత్తుల అమ్మకాలను గురించి వర్క్‌షాప్‌లో వివరించారు. రైతులు ఉత్పత్తి చేసిన వారే అమ్ముకుంటే గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. పనిముట్లు యంత్రాల ద్వారా వ్యవసాయాన్ని సులభతరం చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సారధ్యంలో నడుస్తున్న ప్రోడ్యూసర్స్ కంపెనీ ఎన్‌జివోలు పని చేయాలని సూచించారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు సమర్ధవంతంగా పని చేస్తే ౦రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆ ప్రాంత ప్రముఖులు హాజరైనట్లు తెలిపారు.

## నచ్చనేరి గిరిజనులను ఆదుకోండి:పక్కాగృహాలు నిర్మించండి



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నచ్చనేరి గిరిజన కాలనీ ప్రమాద స్థితిలో ఉందని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తలపా దామోదరంరెడ్డి అన్నారు. మొంథాతుఫానుతో కాలనీ దయనీయ స్థితికి చేరింది. ఈ కాలనీలో మంగళవారం వర్షంలోనే ఆయన తన అనుచరులతో కలసి పర్యటించి వాస్తవ పరిస్థితిని సమీక్షించారు. ఇక్కడ కూలిన గుడిసెలు, పని లేక తల్లడిల్లుతున్న జనం ను చూసి చలించారు. అక్కడ నుంచి ఎంపిడిఓ, ఎంఆర్‌ఓలతో చర్చించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. కాలనీలో నేటికి కనీస సదుపాయాల్లేకపోవటం దారుణమన్నారు. ఇప్పటికే గుడిసెలు కూలుతున్నాయని ఇంకా కొనసాగితే ఇబ్బంది కల్గుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ పథకంలో నిరుపేదలకు అవకాశం కల్పించాలని కోరారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు సురేంద్రరెడ్డి, నవీన్, ఆంటోని, అమరావతి, ఈశ్వర్‌రెడ్డి, శంకర్, అజిత్, మారిలు పాల్గొన్నారు

## వర్షాలకు ధ్వంసమైన కంచనపల్లి రోడ్డు



తొట్టంబేడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త

మండలంలోని పలు రోడ్లు మొంథా తుఫాను ప్రభావంతో పట్టుకున్న ముసారతో రోడ్లు ధ్వంసమ య్యాయి. మంగళవారం కంచనపల్లి గిరిజన కాలనీకి వెళ్ళు రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఈ రోడ్డు ఆర్ అండ్‌బి పరిధిలో ఉంది. గ్రామానికి సమీపంలోని నాగాలమ్మపుట్ట దగ్గర రోడ్డు గతుకుల మయమవ్వటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుంది, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మత్తులు అయినా చేపట్టాలని కోరారు.

## ఎస్వీ పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా స్ఫూర్తి




**తిరుపతి విద్య, అక్టోబర్ 28 ప్రభాత వార్త:** శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్, తిరుపతి ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రజా ప్రదేశాల్లో ఒకరోజు భారీ శుభ్రత కార్యక్రమం ఏపీ ఎస్ ఆర్ టి సి బస్ స్టాండ్‌లో నిర్వహించారు. వాలంటీర్లు బస్ స్టాండ్ ప్రాంగణంలో చెత్త తొలగించి పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఆర్. సైదానాయక్, ఎన్ ఎస్ ఎస్ యువ అధికారి, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్, ప్రొఫెసర్ ఎన్. దామోదరం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్, పి. రాజమోహన్ రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## వీడని వర్షం - అప్రమత్తంగా చేస్తున్న అధికారులు

**విజయపురం, అక్టోబరు 28 ప్రభాతవార్త:** మండలం లోని మొంథా తుఫాను తీవ్రతతో మంగళవారం ఉద యం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి వర్షం వీడ లేదు. మండలంలో తహసీల్దార్ కిరణ్ విజయపురం, మహారాజపురం ప్రాంతాలను ఎంపీడీవో రాజేంద్ర ఇళ్ళ త్తూరు కుశస్థలీనది వరద ఉధృతిని, ఆర్అండ్‌బీ జేఈ నరసింహులు నగరి కనకమ్మసత్రం రోడ్డును, ఒరూరు, గొల్లకండ్రిగ, క్షూరికాపురం ప్రాంతాలను పరిశీలించి కల్వర్టు మంజూరు చేస్తామన్నారు. ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ ప్రత్యేక టీముగా ఏర్పడి ప్రమాదం ఎక్కడ సంభవించడానికి ఆస్కారం ఉంటుందో ఆ ప్రాంతాలను పర్యవేక్షించారు. పన్నూరు చెరువు కట్టను పరిశీలించారు. మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో ప్రహరి నేల కొరిగింది. కేవీ పురంలో పూరిగుడిసె నేలకూలడంతో హౌసింగ్ ఏఈ ఏళుమలై సందర్శించి సహాయక చర్యలు చేపడతామన్నారు. నీటమునిగిన పంటలను మండల వ్యవసాయ అధికారి రజనికుమారి బృందం అంచనా వేస్తున్నారు. మండలంలో 40 చెరువుల్లో సుమారు 28 చెరువులకుపైగా మొరవ పారుతున్నాయి. కార్యక్రమంలో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు అధికారులతో పాటు మండల టీడీపీ నాయకులు చుక్కా ధనంజయ యాదవ్, రమేష్‌రాజు, బాబుయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, మునిభాస్కర్‌రాజు, సుధాకర్‌రాజు, సురేష్‌రాజు, పాల్గొన్నారు.

## సర్దార్ 150 యూనిటీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ



**తిరుపతి విద్య, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు అండ్ క్రీడల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన సర్దార్ 150 యూనిటీ మార్చ్ లో భాగంగా మంగళవారం ఎస్వీయూ ఉపకులపతి ఛాంబర్ లో వర్సిటీ ఉపకులపతి ఆచార్య తాతా నర్సింగారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదల భూపతి నాయుడు, మై భారత్ జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్ బెహెరా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా పాకనాటి హరికృష్ణ చేతుల మీదుగా గోడ పత్రికల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య తాతా నర్సింగారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదల భూపతి నాయుడు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క స్వాతంత్రానంతరం దాదాపు 560 రాజ్యాలను ఏక్ భారత్ (యూనియన్ ఆఫ్ ఇండియా) పేరుతో విలీనం చేసిన త్యాగ నిరతిని, ఉద్యమాలు, భావాలు ప్రస్తుత విద్యార్ధినీ విద్యార్థులకు, యువతరానికి చేరాలని వారు ఆకాంక్షించారు. ప్రదీప్ బెహారా, డా పాకనాటి హరికృష్ణ మాట్లాడుతూ జాతీయస్థాయిలో అక్టోబర్ 6, 2025 నుండి డిసెంబర్ 6, 2025 వరకు సర్దార్ 150 యూనిటీ మార్చ్‌ను నిర్వహిస్తుందన్నారు. తిరుపతిలో అక్టోబర్ 30 గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఈ పాదయాత్ర ఎస్.వి ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి కచాపీ ఆడిటోరియం వరకు సాగుతుందన్నారు. ఇందులో ముఖ్య అతిథులుగా మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎస్వీయూ ఉపకులపతి, రిజిస్ట్రార్ పాల్గొంటారు. ఇందులో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు ఎన్ సి సి క్యాడేట్స్, విద్యార్థిని విద్యార్థులు భాగస్వామ్యం కానున్నారు.

## చిగురువాడ-రామాపురం రహదారిని ఎమ్మెల్యే పరిశీలన

తిరుపతి రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త:



మొంథా తుఫాన్ ఉధృతంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రజలకు సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు తిరుపతిలో జిల్లా విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తూ పరిసర గ్రామాల ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తుంది. మంగళవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చిగురువాడ, తిరుపతి-పచ్చికాపలం రోడ్డును పరిశీలించారు. చిగురువాడలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు చిగురువాడ పంచాయతీ కార్యదర్శి ముత్యాల లక్ష్మీదేవి తెలిపారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన సౌత్ ఇండియా ఓబిసి అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 28, ప్రభాతవార్త** హైదరాబాద్ నగరంలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిని సౌత్ ఇండియా ఓబిసి అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కలిసి ఈ నెల 12వ తారీకున జరిగిన ఓబీసీ సెమినార్ కార్యక్రమం యొక్క జ్ఞాపికను సత్కరించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి ఓబిసి సంక్షేమల కొరకు తామెప్పుడూ సౌత్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ వెంట ఉంటామని అలానే నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్షులైన జబ్బల శ్రీనివాసులు, తన సహచర కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యని సత్కరించి జ్ఞాపికలు అందజేయగా తన వెంట ఎల్లవేళలా ఉన్న సౌత్ ఇండియా ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిని కావడం చాలా సంతోషకరమని తెలియజేశారు. అలానే రాబోవు కాలంలో కూడా అందరం కలిసి ఓబీసీల అభివృద్ధి సాధనకై కృషి చేద్దామని తెలియజేశారు. అలాగే ప్రొఫెసర్ కోదండరాంకి సత్కరించి జ్ఞాపికను అందజేసారు. కోదండరాం ఎల్లవేళలా ఓబీసీల వెంట ఉంటూ వారి అభివృద్ధికి తాను సైతం సౌత్ ఇండియా ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వెంట ఉంటానని తెలియజేశారు. అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ కేజీ కృష్ణమూర్తిని కలిసి సత్కరించి జ్ఞాపికను అందజేయగా, రాబోవు కాలంలో ఓబీసీ కులాలవారు అన్ని వర్గాలలో రాణించాలని అలానే ముఖ్యంగా న్యాయవ్యవస్థలో మరింత ప్రతిభ చూపించాలని కోరారు

## శ్రీవారిని దర్శించుకున్న సికె సాయికృష్ణారెడ్డి



**తిరుమల, అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వర స్వామిని చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికెబాబు కుమారుడు, టిడిపి యువనాయకుడు సికె సాయికృష్ణారెడ్డి మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఉదయం స్నేహితులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయం లోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 30న ప్రసన్న వెంకటేశ్వరునికి కల్యాణోత్సవం

**వడమాలపేట, అక్టోబరు 28 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం అక్టోబరు 30 గురువారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఏఈవో దేవరాజులు తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణం రోజున ప్రతి నెల స్వామివారి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు 300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు సాంప్రదాయ దుస్తులు ధరించి రావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

## మొంథా తుఫాను ప్రభావంతో ఎడ తెరిపిలేని ముసురు

**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 28 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫానుప్రభావం వలన మండలంలో సోమవారం రాత్రి నుంచి ఎడ తెరిపి లేని ముసురు గాలివాన కురుస్తుంది. ముందే కురిసిన వర్షాలు వలన చెరువులు, వాగులు నిండుకుని ప్రమాద స్థాయిలో ఉన్నాయి. పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. మొంథా తుఫాను వలన తీవ్ర ప్రభావం ఉంటుందని అధికారులు ముందస్తు జాగ్రత్త ప్రకటనలు చేయడం వలన మండల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం తరచూ తుఫానులు ప్రభావం వలన వర్షాలు పడుతున్నాయి. దీంతో రైతన్నలకు వ్యవసాయ సాగు ఎలా చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. తుఫాను ప్రభావం వలన రైతులు పంట పొలాల్లోకి వెళ్ళడానికి భయపడుతున్నారు. వర్షాలు ప్రభావం వలన వ్యవసాయ సాగు మొదట్లో పంట రాబడి సమయంలో ప్రతిసారి రైతులు నష్టపోతున్నారు. పంటలు నష్టం జరిగినప్పుడు అధికారులు పరిశీలించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రజలు, కూలీ పనులు చేసుకుని కూలీలు కూడా ఇళ్ళకే పరిమితమై ఎటువంటి పనులు లేక పనులకు వెళ్ళలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇప్పుడు మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతుంది. ఈ తుఫాను ప్రభావం వలన నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## బైరవానీ గుంట చెరువుకు బొగడ

నీటమునిగిన పంట పొలాలు



బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 28 ప్రభాతవార్త:

మండలంలోని మొంథా తుఫాను ప్రభావం కురుస్తున్న వర్షాల వలన కుక్కంబాకం లోని బైరవానిగుంట చెరువుకు తూము వద్ద బొగడ పడడం జరిగింది. ఈ చెరువు కింద సుమారు 200 ఎకరాల్లో వరి సాగు చేశారు. దీంతో చెరువు కింద వరిపంట పొలాలు నీట మునిగి గండ్లు పడ్డాయి. చెరువులోని నీరంతా వృథాగా పోతుందని విషయం తెలుసుకున్న రైతులు, అధికారులు బొగడను పూర్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడం వలన బొగడను పూర్చడానికి ఇబ్బందికరంగా మారింది.

## తుఫానుపై అధికారులతో సమావేశమైన సీఈవో రవికుమార్



**బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 28 ప్రభాతవార్త:** మొంథా తుఫానుప్రభావంతో ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి సమన్వయంగా పని చేయాలని జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్‌నాయుడు అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీడీవో, తహసీల్దార్, మండల స్థాయి అధికారులతో తుఫానుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటూ తుఫాను ఎదుర్కొనేందుకు తగు చర్యలు చేపట్టాలని, విపత్తుల సమయంలో ప్రజలకు సేవ చేయడం మనందరి బాధ్యతని అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మండలంలోని లో తట్టు ప్రాంతాలైన గ్రామాల్లో ప్రజలకు రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జేసీబీలు, క్రేన్లు వంటి యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉండే వాగులు, వంకలు, కాళంగి నది ప్రవాహ ప్రాంతాలు, తెలుగు గంగ కాలువల ప్రవాహాల వద్ద ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో రవింద్రనాథ్, వైద్యాధికారి మురళీధర్, ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

## అధికారులతో జెడ్పీ సీఈవో సమీక్ష సమావేశం



**కేవీబీ పురం, అక్టోబరు 28 ప్రభాతవార్త:** మొంథా తుఫానుప్రభావంతో ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టి సమన్వయంగా పనిచేయాలని జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన కేవీబీ పురంలో జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్‌నాయుడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, తహసీల్దార్ అధికారులతో తుఫాను వల్ల ప్రజలను సురక్షితంగా కాపాడేందుకు జాగ్రత్తలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెరువులు, ప్రాజెక్టులో ఏదైనా ప్రమాదవశాత్తు జరిగితే సమస్యలను గుర్తించి గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయాలని ఆయన అధికా రులను కోరారు. కార్యదర్శులను, వీఆర్‌వోలను హెడ్ క్వార్టర్స్‌లో ఉండే విధంగా 24 గంటలు అందు బాటులో ఉండాలనితెలిపారు. సమావేశంలోఎంపీడీవో మాలతి, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో అనుమోల్ అంబాని



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మంగళవారం అనుమోల్ అంబాని కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఓ వైపు మొంథా తుఫును వణికిస్తుంటే లెక్క చేయక వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి దర్శన ఏర్పాట్లును ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గాదిపాకుల గోపినాధ్‌లు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. వారికి ఆలయ ప్రధాన్యతను వేదపండితులు వివరించారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఛైర్మెన్, సభ్యులు అందించారు. ఏరానపట్లును ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఎపిఆర్‌ఓ రవి, ఆలయ ఇన్సెపెక్టర్ సుదర్శనం ఉపర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## వీరభద్రుని ఆలయంలో ప్రారంభమైన బాలాలయం పూజలు

**నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ కోటవీధిలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం పునం నిర్మాణం కోసం టిటిడి అధికారులు నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆలయ పునం నిర్మాణ పనులకు సంబందించి బాలాలయం పనులు పూర్తయ్యింది. మంగళవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమం, 29వతేది బుధవారం యాగశాల పూజ, హోమం, పూర్ణాహుతి, 30వతేది గురువారం పుణ్యవచనం. యాగశాల పూజ, 8గంటలకు ప్రాణ ప్రతిష్ట, కలశాభిషేకం, కలశ అభిషేకం, దీపారాధన, 12గంటలకు బాలాలయ దర్శనం భక్తులకు కల్పించడం జరుగుతుందన్నారు.

## నవంబర్ 1 నుంచి పద్మావతీ అమ్మవారి కార్తీక తెప్పోత్సవాలు



**నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు నవంబర్ 1నుంచి5వ తేది వరకు 5రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా టిటిడి అధికారులు తామరగుంట పుష్కరణిని చుట్టు విద్యుత్‌దీపాలు, తోరణాలు, విద్యుత్ కటౌట్లను కట్టారు. నారాయణవనం, పుత్తూరులో పోస్టర్లు, కరపత్రాలను పంచిపెట్టారు. నవంబర్1వ తేది శనివారం రాత్రి సీతా లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి 2వతేది ఆండాల్ అమ్మవారు, 3, 4, 5వ తేదీల్లో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు తెప్పపై ఊరేగడం జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల కృషి అమోఘం



**నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా వుంచడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి అభినందనీయమని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. నారాయణవనం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కె.జి శారదమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ పారిశుద్ధంలో జిల్లా స్థాయిలో అవార్డురావడానికి కారణం పారిశుద్ధ్య కార్మికులేనన్నారు. కార్మికులు ప్రతిరోజు శుభ్రంగా వుంచడం వల్లే ఉన్నత అధికారుల నుంచి గుర్తింపురావడం జరిగిందన్నారు. వారికి ప్రభుత్వం తరపున అందించే దుస్తులు, రెమ్యూనిరేషన్ పెంచి వారిని ఆదుకోవడంలో తప్పులేదన్నారు. అనంతరం ఏడాది సంబంధించి ఖర్చు-జమ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, ఇఓ కెపి షణ్ముగం, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్త మృతికి పలువురు నివాళి



**నారాయణవనం, అక్టోబర్ 28 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీకి చెందిన మైనారిటీ సెల్ విభాగం సీనియర్ నాయకులు అలియాసాహెబ్ కుమారుడు హనిఫా(51) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న సత్య వేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయనతో పాటు మైనారిటీ నాయకులు మొహిద్దీన్, షాజహాన్, ముత్తు సాహెబ్, ఆలీబాయ్, బాలికల స్కూల్ కమిటీ ఛైర్మన్ మోహన్, సొరకాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసుల క్రీడా ఎంపిక పోటీలు వాయిదా

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. శశిధర్

**తిరుపతి క్రీడ, అక్టోబర్ 28, ప్రభాతవార్త** తుపాను పరిస్థితుల దృష్ట్యా శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ల ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగాల్సి న ఆల్ ఇండియా సివిల్ సర్వీసుల క్రీడా పోటీలకు సంబంధించి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపిక పోటీలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. శశిధర్ తెలిపారు. త్వరలో కొత్త తేదీలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు, సంబంధిత శాఖ అధికారులు మరిన్ని సమాచారం కోసం క్రీడాభివృద్ధి అధికారిని సంప్రదించాలని ఆయన తెలిపారు.

## ముంపు గ్రామాల ప్రజలకు అండగా ప్రభుత్వం

పిళ్ళారికోన చెరువుకు ఎంఎల్ఏ జలహారతి



**రామచంద్రాపురం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. మంగళవారం ఆయన రాయలచెరువు కట్ట, తూములను పరిశీలించారు. పిళ్ళారికోన చెరువుకు పూర్తి స్థాయిలో నీటి మట్టం చేరడంతో గ్రామస్థులతో కలసి ఎంఎల్ఏ చెరువుకు జలహారతి ఇచ్చారు. చెరువుల వద్ద చేపట్టవలసిన భద్రతా చర్యలను అధికారులతో చర్చించారు. అనంతరం కాలేపల్లి, చిట్టత్తూరు గ్రామాలను సందర్శించారు. చిట్టత్తూరులో గత 5 నెలలుగా త్రాగునీటి సమస్య వుందని మహిళలు ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఏ 2 రోజుల్లో సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రామ్మోహన్, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి నాయకులు చినబాబు, తినికొండ కేశవులునాయుడు, కొట్టె నరశింహారెడ్డి, కొట్టె గిరిధర్ రెడ్డి, కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్ర నాయుడు, లెక్కల మహేష్ నాయుడు, తానికొండ రెడ్డెప్ప నాయుడు, కోటీశ్వర్ రెడ్డి, రావిళ్ళగిరి, సునీల్ యాదవ్, విజయ్‌కుమార్ రాయల్, విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మా చీటి డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి

తిరుపతి హెల్త్, అక్టోబర్ 28, ప్రభాతవార్త

మా చీటి డబ్బులు ఇప్పించి మాకు న్యాయం చేయాలని దుర్గ సముద్రానికి చెందిని జయచంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండల పరిధిలోని దుర్గ సముద్రం గ్రామానికి చెందిన ఎం. జయసింహా రెడ్డి అతని భార్య ఎం. సుమతి, వియ్యంకుడు ఎం. మునికృష్ణారెడ్డి, ఎం. వాసుదేవ రెడ్డిలు ఒకే గ్రామానికి చెందిన వారు 1 లక్ష, 2 లక్షలు, 5లక్షలు, 10 లక్షలు, 25 లక్షలు, 50 లక్షలు, కోటి రూపాయిల చీటీలు ఆరు నెలలకు ఒకసారి కట్టేలా వేశారని, చీటి పాడిన సభ్యుడు దగ్గర సెక్యూరిటీ సంతకం, ఖాళీ ప్రామిసరీ నోటు తీసుకున్నారన్నారు. వాటిని వారి దగ్గర పెట్టుకొని ఎవరికీ ఇవ్వకుండా ఊరు వదిలి వెళ్లిపోయారని వాపోయారు. 2012 అందరూ చీటీలు వేశారు. 2015 సంవత్సరంలో చీటీలు ఆపేసి ఎవ్వరికీ డబ్బులు ఇవ్వకుండా ఊరు వదిలి వెళ్లిపోయారు. అనంతరం 2021లో తమ గ్రామానికి వచ్చి సుమారు 200 మంది వద్ద సంతకాలతో వున్న ఆ ఖాళీ ప్రామిసరీ నోట్లు పెట్టుకొని, ఎవ్వరికీ ఇవ్వకుండా బెదిరిస్తూ, కోర్టుకు వేస్తామ అంటూ దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయం పై 2023లో తిరుపతి ఎస్పికి ఫిర్యాదు చేసామన్నారు. వారు స్పందించకపోవడంతో అదే అదనుగా చూసుకొని మా ఖాళీ బాండ్లలో అతని ఇష్టం వచ్చినంత అమౌంటు వేసి కోర్టుకు వేసి బెదిరిస్తున్నాడన్నారు. ఇతని ఆగడాలు భరించలేక మరల 2025 సంవత్సరంలో తిరుపతి జిల్లా ఎస్పికి స్పందన నందు ఫిర్యాదు చేసామన్నారు. ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ దగ్గర విచారణ జరపడానికి గత 5 రోజులుగా స్టేషన్‌కు విచారణకు రాకుండా వారి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని బెదిరించారు. అతనిని విచారించగా ఓటేరు గ్రామానికి చెందిన చలపతి టవర్స్ 504లో కాపురముంటున్నాడు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని 200 మందికి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మునికృష్ణారెడ్డి, రఘురాం రెడ్డి, శాంతమ్మ సుబ్రమణ్యం, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## ఉన్మాది వడిత్యా శంకర్ నాయక్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

టిడిపి గిరిజన దళిత నాయకులు డిమాండ్

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 28, ప్రభాతవార్త** మాజీ ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ ఇటీవల మదనపల్లి మీడియా సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యాలకు వెంటనే క్షమాపణ చెప్పాలని టిడిపి గిరిజన దళిత నాయకులు డిమాండ్ చేసారు. మంగళ వారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి పరంగా తీరని అన్యాయం, నష్టం చేశారన్నారు. బేధబావాలు లేకుండా సజావుగా పరిపాలన సాగుతున్న సందర్భంలో ఇలాంటి అనుచిత వ్యాఖ్యాలు చేయడం తగదన్నారు. తాను చేసిన అనుచిత వ్యాఖ్యాలు గిరిజన జాతికి, గిరిజన నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎన్. సుబ్బయ్య, టిడిపి సీనియర్ దళిత నాయకులు కె. సుధాకరయ్య, రాష్ట్ర ఎస్టి సెల్ కార్యదర్శి, రాష్ట్ర ఎవిఎస్, ఎపిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్ నాయక్, చంద్రగిరి నియోజకవర్గ ఎస్సి సెల్ అక్కి, అధ్యక్షులు పాటూరు మోహన్, గిరిజన నాయకులు విజయ్ నాయక్, కె. ధనరాజ్, విజయ్ నాయక్, మోహన్, చిట్టి, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణీ డ్యామ్‌పై వదంతులు నమ్మవద్దు: తహశీల్దార్



చంద్రగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో గడచిన 24 గంటలకు పైగా ఎడతెరిపిలేని జడివాన కురుస్తున్నది. ముందస్తు ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమయ్యారు. మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుండి ఏమాత్రం ఎడతెరపి నివ్వకుండా మంగళవారం పూర్తిగా తేలికపాటి వర్షం కురుస్తూనే వున్నది. మండల పరిధిలోని కళ్యాణీ డ్యామ్‌లో నీటి మట్టం పెరిగిందనీ, గేట్లు ఎత్తివేస్తారనే వదంతులు నమ్మవద్దని తహశీల్దార్ శివరామసుబ్బయ్య, సిఐ సురేష్‌కుమార్ ప్రజలకు సూచించారు. ఎవరైనా సామాజిక మాధ్యమాలలో కళ్యాణీ డ్యామ్ గేట్లు ఎత్తివేస్తున్నారంటూ తప్పుడు ప్రచారానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళ్యాణీ డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 900 అడుగులు కాగా మంగళవారం ఉదయం 6 గంటల సమయానికి 868 వద్ద నిలకడగా వున్నట్లు తెలిపారు. గత పది రోజులు సుమారు 20 అడుగుల మేర నీటి మట్టం పెరిగినట్లు తెలిసింది. అయితే ఏ క్షణంలోనైనా పరిస్థితి అదుపుతప్పి భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు : ఎమ్మెల్యే




వెంకటగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: తుఫాను ప్రభావం వల్ల ఎలాంటి నష్టం వాటిలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కుడుగండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో తుఫాను ప్రభావంతో ఎలాంటి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే రామకృష్ణ కాశీ నుండి అధికారులతో ఫోన్లో సమీక్షించారు. పట్టణం, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అధికారి రమేష్ మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్లకు, చెరువులకు గండ్లు పడితే వెంటనే పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పర్యవేక్షించి ప్రమాదాల నివారణపై చర్యలు చేపట్టాలని తెలిపారు. సిఐ ఏవి రమణ మాట్లాడుతూ కైవల్యా నది, గొడ్డేరు వాగుల వరదలు ఎవరు దాటరాదని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తాసిల్దార్ నరసింహారావు, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఎస్సై ఏడుకొండలు, వ్యవసాయ శాఖ అధికారిని సుజాత, సిడిపిఓ శంషాద్ బేగం మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కాళంగి నది వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే



దొరవారిసత్రం, అక్టోబర్ 28 ప్రభాతవార్త : దొరవారి సత్రం మండలంలో మొంథా తుఫాన్ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ మంగళవారం పర్యటించారు. ఎమ్మెల్యే విజయ శ్రీ మాట్లాడుతూ ప్రజలు అవసరమైతే తప్ప అనవసరంగా బయట రావద్దని తెలిపారు. తనియాలి సమీపంలో ఉన్న కాళంగి నది వంతెనను అధికారులతో కలిసి పరిశీలించి అక్కడకు తనియాలి గ్రామానికి చెందిన కొంతమంది గ్రామస్తులు ఆర్‌అండ్‌బి రోడ్లు గుంతలు మాయంగా ఉన్నాయని ఎన్ని సార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆమె వద్ద వాపోయారు. ఆమెతో పాటు మండల తహశీల్దార్ శైలు కుమారి, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఏఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి : ఎమ్మెల్యే పాశం



చిల్లకూరు, అక్టోబర్ 28 ప్రభాతవార్త: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంత గ్రామాలైన తమ్మిన పట్నం, వరగలి, మోమిడి, మన్నే గుంట, పోసినవారిపాలెం, పల్లివాని దెబ్బ గ్రామాల్లో తాసిల్దార్ కే శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి సూచనల మేరకు అన్ని గ్రామ పంచాయతీలో ఉన్న గిరిజన కుటుంబాల ప్రజలను సురక్షితగా పునరావస కేంద్రాలకు తరలించి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఎలాంటి తుఫాను అయినా ఎదురు కోవడానికి ముందస్తు చర్యల్లో భాగంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బోట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని అదేవిధంగా తిప్పగుంటపాలెం గ్రామ సమీపంలో ఉన్న ఉప్పుటేరు వాగు పొంగి ప్రవహించడం ఆ గ్రామ ప్రజలకు రాకపోకలు లేకపోవడంతో వారికి నిత్యావసర సరుకులు భోజన వసతి కల్పించడం జరిగిందన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు, అన్ని శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## అండగా ఉంటా...అధైర్య పడవద్దు : మట్టం శ్రావణి



గూడూరు రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెన్నూరు గ్రామంలోని నేపాల్ గిరిజన కాలనీ, వైఎస్ఆర్ గిరిజన కాలనీలలో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ళు పూర్తిగా దెబ్బతిన్న వాళ్ళు, ఆ ఇంటి నందు ఉండకుండా దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్‌లో ఉండేలా పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి వసతి, భోజన సదుపాయాన్ని కల్పించామన్నారు. ఈమె వెంట విఆర్‌వోలు చంద్రశేఖర్, తన్వీర్, హిమ్మత్, రాఘవయ్యలు పాల్గొన్నారు.

## భోజన ప్యాకెట్లు వితరణ



గూడూరు రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త: తుపాన్ నేపథ్యంలో గూడూరు మండల పరిధిలోని పోటుపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీ, శారద నగర్ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి భోజన ప్యాకెట్లు, రెయిన్ కోట్‌లు, గొడుగులను అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధైర్యపడవద్దు అని, గ్రామ స్థాయి అధికారులు ఉంటారని ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహసీల్దార్ ఆర్.వి. ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏఈ సురేష్, డాక్టర్ కోట సునీల్ కుమార్, రూరల్ ఎస్ఐ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తీరంలో మెరైన్ డిఎస్‌పి



కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ డిఎస్‌పి బాలిరెడ్డి, కోరారు. మంగళవారం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాస్‌సత్రం, గోవిందపల్లి పాళెం సముద్ర తీరంలో ఆయన మత్స్యకారులకు తుపాన్ పట్ల అవగాహన కల్పించారు. భారీవర్షాల సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. తీరం వెంబడి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని కోరారు. ఆయన వెంట మెరైన, ఎస్ఐ శివసామ్య హెడ్‌కానిస్టేబుల్ బెల్లంకొండ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## కాళంగి నది కరకట్టకు ముందస్తు చర్యలు



శ్రీసిటీ (తడ), అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావంతో మంగళవారం తడ మండల పరిధిలో వర్షాలు విస్తారంగా కురిసాయి భారీ వర్షాల ప్రభావంతో పాముల కాలువ కరిపేటి కాలువ, నెర్రి కాలువ కాలంగి నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి వరద ప్రభావిత ప్రాంతాలలో మండల తహసిల్దార్ శరత్ బాబు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాటంబేడు కుప్పం వద్ద కాళంగి నది కరకట్ట తెగే ప్రమాదం ఉండడంతో ముందస్తు చర్యలుగా ఇసుక బస్తాలు వేయించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు అధికారులను అప్రమత్తం చేశారు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వారి వెంట టిడిపి నేత బొమ్మన పళని, అధికారులు ఉన్నారు.

## చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



శ్రీసిటీ (తడ), అక్టోబర్ 28 ప్రభాతవార్త: మండల పరిధిలోని వరద ప్రభావిత గ్రామాలైన వాటంబేడు, కాదలూరు, వెండ్లపాడు, మాంబట్టు చెరువులను మొంథా తుఫాను తడ మండల స్పెషల్ ఆఫీసర్ ఇరిగేషన్ డిఈ కస్తూరి, ఇరిగేషన్ ఏఈ సంపత్ కుమార్ పరిశీలించారు. వాటంబేడు కుప్పం వద్ద కాళంగి నది కరకట్ట ప్రమాద స్థితిలో ఉండడంతో ముందస్తు చర్యలుగా ఇసుక బస్తాలు వేయించారు అదేవిధంగా మండలంలో చెరువు కరకట్టలు ప్రమాద స్థితిలో ఉంటే తెలియజేయాలని కోరారు. ప్రమాదం సంభవించకుండా ముందస్తు చర్యలు చేపడుతామని ఇరిగేషన్ అధికారులు తెలియజేశారు.

## గిరిజన కుటుంబాలకు భోజనం పంపిణీ



శ్రీసిటీ (తడ), అక్టోబర్ 28 ప్రభాతవార్త : మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలకు రామాపురం, పెరియట్టు గ్రామాలలోని గిరిజన కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు ఎమ్మార్వో శరత్ బాబు, ఎస్సై కొండప్ప నాయుడు, ప్రత్యేక చర్యలు చేపట్టారు. 150 మంది గిరిజనులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వీఆర్వో బాబు, హెడ్ కానిస్టేబుల్ కామేశ్వరరావు, సుధాకర్, సర్వేర్ కార్తీక్, సహాయ చర్యల్లో పాల్గొన్నారు.

## వర్షాలకు స్తంభించిన జనజీవనం



రేణిగుంట అక్టోబర్ 28 ప్రభాతవార్త: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వాగులు, వంకలు, జలాశయాలు, కాలువలు వర్షాల వల్ల పొంగి పొర్లుతున్నాయి. అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి నీరు ప్రవేశించి వంట చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుక్ చేసుకున్న గ్యాస్ సిలిండర్లు సకాలంలో డెలివరీ కాకపోవడంతో మహిళలు గుడుగులు పట్టుకొని కట్టెల పొయ్యలతో రోడ్డుపై వంట చేసుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేయకపోవడం పట్ల సిపిఎం పార్టీ నేతలు హరినాథ్, ఈశ్వరమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవిన్యూ, పోలీస్, మండల అభివృద్ధి యంత్రాంగం ముందస్తు సూచనలతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. తిరుపతి జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్ బాబు, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం మండలంలోని ఎరమరెడ్డి పాలెం చెరువును పరిశీలించారు. మల్లెమడుగు రిజర్వాయర్ కు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు విపరీతంగా వరద నీరు చేరుకుంటుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 900 క్యూసెక్కులు నీరు వస్తుండగా అవుట్ ఫ్లో 900 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర, డీఎస్పీ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎప్పటికప్పుడు తుఫాన్ స్థితిగతులను తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పోలీస్ అధికారులు వంతెనలు, అండర్ బ్రిడ్జిలు, తూములు వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## రక్తదానంతో ప్రాణదానం

### -అమరవీరుల వారోత్సవాల్లో పోలీసులు రక్తదానం



తిరుపతి, అక్టోబర్ 28ప్రభాతవార్త: రక్తదానం ద్వారా ప్రజలకు ప్రాణదానం చేసే అవకాశం రావడం చాలాసంతోషమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంగళంమార్గంలోని ఓ హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతరులు రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఒకరి రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఒక్కరోజే రక్తదాతల నుండి 580 యూనిట్లు రక్తం సేకరించి ప్రభుత్వ వైద్యశాలలకు వితరణ చేశారు. తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట, పుత్తూరు సబ్‌డివిజన్ల నుండి పోలీసులు, విద్యార్థులు, డ్రైవర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి, నాగభూషణరావు, డిఎస్పీలు వెంకటనారాయణ, శ్రీలత, ప్రసాద్, శ్రీనివాసులు, రామకృష్ణమాచారి, చందు, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రావద్దు : తహసీల్దార్



కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త: తుపాన్ హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని ఆధునిక సాంకేతికక సాయంతో ముందస్తు చర్యలు చేపట్టడం జరుతుందని కోట మండల తహసీల్దార్, కె.జయజయరావు వివరించారు. మంగళవారం కొత్తపట్నం పంచాయతీలోని గొవిందపల్లె పాలెం గ్రామంలో మత్స్యకారులకు తుపాన్ పట్ల అవగాహన కల్పించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని అన్ని చర్యలు తీసుకొవడం జరుగుతందన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దున్నారు. అనతరం ఆయన గూడలి స్వర్ణముఖి నదిని కూడా పరిశీలించారు. తహసీల్దార్ వెంట, ఎండివో దీలిప్ కుమార్, ఎస్.ఐ పవన్‌కుమార్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## చాపలపల్లిలో తుఫాన్ పునరావస కేంద్రం ఏర్పాటు



దక్కిలి, అక్టోబరు 28 ప్రభాతవార్త: దక్కిలి మండలం చాపలపల్లి గ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో మంగళవారం తుఫాన్ పునరావస కేంద్రంను అధికారులు ఏర్పాటు చేశారు. పూరి గుడిసెలలో ఉన్న గిరిజన కుటుంబాలను నుంచి వారికి మంచినీటి సౌకర్యం, భోజన వసతులు కల్పించారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో దక్కిలి తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు, ఎంపీపీ గోను రాజశేఖర్, ఎంపీడీఓ రవీంద్రబాబు, ఎస్ఐ శివ శంకర్‌లు కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. వారి వెంట డిప్యూటీ ఎంపీడీఓ నరసింహులు, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఉన్నారు.

## సిద్ధవరం సచివాలయం ఆకస్మిక తనిఖీ

కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మండలంలోని సిద్ధవరం గ్రామ సచివాలయాన్ని మంగళవారం తహసీల్దార్ కె.జయజయరావు, ఎంపిడివో దీలిప్ కుమూర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉన్నారా లేదానని పరిశీలించారు. తీర ప్రాంతానికి ఈ సచివాలయం అందుబాటులో ఉన్నందున అధికారులు సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు.

## ఆహారం పంపిణీ చేసిన ...తెదేపా నేత జీలీల్



కోట, అక్టోబర్ 28 ప్రభాతవార్త : కోట మండలంలో మొంథా తుపాన్ ప్రభావం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు, గూడూరు శాసన సభ్యులు పాశం సునిల్ కుమూర్ ఆదేశాలతో కోటలోని శ్రీలక్ష్మీ గిరిజన కాలనీలో మంగళవారం జిల్లా తెదేపా అధ్యక్షులు షెక్.జీలీల్ ఆహ్మద్, ఎంపిటిసీలు షంషద్దీన్, దార సురేష్‌లు 500 కుటుంబాలకు పండ్లు, బిస్కెట్లు ను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా జీలీల్ ఆహ్మద్ మాట్లాడతూ ప్రజలందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తుపాను కారణంగా ప్రతి కుటంభం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వెంకన్నపాళెం గ్రామ సర్పంచ్.కె.మధుయాదవ్, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపిచే పోరాటం



వెంకటగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నందుకు వైసిపి ఆధ్వర్యంలో ఉధృతంగా పోరాటం చేస్తామ జిల్లా టెలికం సలహా మండలి సభ్యులు చిట్టి హరికృష్ణ తెలిపారు. 20వ వార్డు నియోజకవర్గ సమన్వయకర్త సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆదేశాలు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లను ప్రయివేట్ పరం చేయదాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజా అభిప్రాయంను వారి సంతకాల సేకరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కల్లు. సతీష్ కుమార్, 20వ వార్డు కౌన్సిలర్ కల్లు మళ్ళీశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అబుభకర్, యువజన నాయకులు సంపత్, వెంకటేష్, వాలంటీర్లు హరీష్, అంకయ్య, దావుద్, సైఫుద్దీన్ పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం: కమాండెంట్ సాయి



వెంకటగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: రక్తదానం ప్రాణదాలతో సమానమని స్థానిక తొమ్మిదవ బెటాలియన్ కమాండెంట్ ఎస్ సాయి ప్రసాద్ తెలిపారు. 9వ బెటాలియన్ నందు పోలీసుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలులో భాగంగా మెగా ఉచిత వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అత్యవసర సమయంలో రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. తిరుపతి రమాదేవి హాస్పిటల్స్ సహకారంతో ఈ మెడికల్ క్యాంపు బ్లడ్ డొనేషన్ క్యాంపు విజయ వంతంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రమాదేవి హాస్పిటల్స్ డాక్టర్ కిషోర్, డాక్టర్ మనోజ్, డాక్టర్ వేద తేజ, డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ కిరణ్ ప్రసాద్, డాక్టర్ సునీత యూనిట్ మెడికల్ ఆఫీసర్స్ అసిస్టెంట్ కమాండెంట్ రామకృష్ణ, ఆర్ఐలు సత్యనారాయణ, శివయ్య ఇతర ఆఫీసర్స్, సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## తుఫాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి : నేదురుమల్లి

వెంకటగిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: తుఫాను పట్ల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రవికుమార్ రెడ్డి తెలిపారు. తుఫాను ప్రభావంతో, రాబోయే రెండు రోజులలో మన వెంకటగిరి నియోజకవర్గంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో, ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, ప్రజల భద్రత కోసం ముందస్తు రక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. వర్షంలో లేదా వరద నీటి దగ్గర పిల్లలు ఆడకుండా చూసుకోవాలనిచూసుకోవాలని కోరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 8712603258 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు. వైసీపీ ఆధ్వర్యంలో తగు సహాయం చేస్తామన్నారు.

## పొర్లు కట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



వాకాడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడడంతో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సుడిగాలి పర్యటన సందర్శించారు. మంగళవారం వాకాడు మండలం బాలురెడ్డి పాలెం స్వర్ణముఖి నది పొర్లు కట్లు, వాకాడు స్వర్ణముఖి నది బ్యారేజ్ కం బ్రిడ్జిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన అధికారులకు సూచనలు సలహాలు అందజేశారు. తుఫాన్ ప్రభావితమైన ప్రాంతాలలో బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది అన్నారు. నాయకులు తమ వంతు సహాయం సహకారాలు అందిస్తారన్నారు. మంతా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా అధికారి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, సిఐ హుస్సేన్ భాష, ఎస్ ఐ నాగబాబు, వివిధ శాఖ అధికారులు, ప్రతినిధులు నాయకులు వున్నారు.

## పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన డిఎల్‌డివో, ఎంపిడివోలు



గూడూరు రూరల్, అక్టోబర్ 28 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావంతో గూడూరు మండలంలో విస్తారంగా వర్షాలు కురుసున్నాయి. గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నందు తుఫాన్ చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రాన్ని గూడూరు డిఎల్‌డివో వాణిరెడ్డి, ఎంపిడిఓ మధుసూదన్ రావులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ విందూరు గ్రామంలోని లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికారులు అందుబాటులో ఉండి సహాయ చర్యలు అందించాలని సూచించారు.

## మొంథా తుఫాన్‌తో ముసార...మూల పడ్డ జనజీవనం

### పలు ప్రాంతాల్లో పరిశీలించిన ఎంఎల్ఏ బొజ్జల



శ్రీకాళహస్తి, అక్టోబర్ 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ప్రాంత అక్టోబర్ నెల సాధారణ సగటు వర్షపాతం 229 మి.మీలు. ఏడాది సాధారణ సగటు వర్షపాతం 1200 మి.మీలు. అయితే ఈ ఏడాది సోమవారం వరకు 600 మి.మీలు నమోదైంది. మంగళవారం 21.3 మి.మీల వర్షపాతం నమోదైంది. అక్టోబర్ 20 నుంచి నాలుగురోజుల్లో 380మి.,మీలు నమోదైంది. ఏడాది వర్షపాతంలో సగం వారం రోజుల్లో నమోదైంది. మొంథా తుపాను హెచ్చరికతో జనం భయభ్రాంతుల య్యారు. ఉదయం నుంచి అధికారులు పరుగులు తీయగా సాయంత్రం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయ్యాయి. ముఖ్యంగా ఏరియా ఆసుపత్రి రోడ్డు ఎన్ని సార్లు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా చినుకుపడితే గుంతలమయంగా మారుతుంది. అధికారులు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ జనాలను చైతన్యవంతుల్ని చేసారు. స్వచ్ఛంద సేవా సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**ఎంఎల్ఏ పర్యటన:**

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంటకసుధీర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం వర్షం కురుస్తున్నా, శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని ముళ్ళపూడి గిరిజన కాలనీ, దొమ్మరపాళెం, కాసరం రోడ్డులో పర్యటించారు. ఈ మార్గంలో ధ్వంసమైన ఆర్‌అండ్‌బి రోడ్డును ఎంఎల్ఏ పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. ఏర్పేడు మండలంలో తహశీల్దార్, భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యంలతో చర్చించారు. ఈ మండలంలోని పలు గిరిజన కాలనీల్లో దయనీయ స్థితి ఉండటం గుడిసెలు కూలుతుండటంతో వారికి సహాయ చర్యలు చేపట్టాలని వారికి పునరావసకేంద్రాలకు సంబంధించి సమీక్షించారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు వారి సహచరులున్నారు.

## తుపాను సహాయక చర్యలు వేగవంతం : ఎమ్మెల్యే గాలి



పుత్తూరు (నగరి), అక్టోబరు 28 ప్రభాతవార్త : మొంథా తుపాను సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నియోజకవర్గంలోని తుపాను బాధిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నగరి రూరల్ మండలంలోని తీవ్ర వర్షాలతో ఇబ్బందులు పడుతున్న వేలావడి గిరిజన కాలనీ సందర్శించి బాధితులకు తగిన సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు, నిండ్ర, వడమాలపేట మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్న బాధితులను ఆయా ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ఆ కేంద్రాల్లో వున్న ప్రజలకఉ భోజనం ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. ఇళ్లు పడిపోయిన వారికి పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి స్థలం వుండి ఇళ్లు లేని వారికి కూడా పక్కా గృహాలు మంజూరు చేయిస్తానన్నారు. కృష్ణాపురం బ్యారేజ్ నిండినపుడు గేట్లు ఎత్తడం వల్ల గొలుసు కట్టు చెరువులు నిండుతూ వరద పెరుగుతోందన్నారు. కుశస్థలి నదిలో వరద ఉధృతికి ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో బ్రిడ్జిల మంజూరు అంశం ఇది వరకే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మొత్తం 26 కోట్ల అంచనా వ్యయంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రిన్సిపల్ కార్యదర్శి కృష్ణబాబుతో చర్చించామని తెలిపారు. పర్యటనలో ఆయనతో పాటు నగరి తహశీల్దారు రవికుమార్, ఇంజనీరింగ్, విద్యుత్, ఇరిగేషన్, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయండి : ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, అక్టోబర్ 28 ప్రభాతవార్త: కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. అలాగే మజ్జిగ కాలువ నీటి మళ్ళింపుపై తక్షిణం చర్యలు తీసుకుని కేశవాయనగుంట వాసులకు డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలని ఎస్ఈ శ్యామ్‌సుందర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. జలమయమైన గొల్లవాణి గుంట ప్రాంతాన్ని ఎమ్మెల్యే, ఇంజినీరింగ్ అధికారులు, ఎన్డీఏ నాయకులతో కలిసి పరిశీలించారు. వర్షం వస్తే తమ రోడ్లు మునిగిపోవడమే కాకుండా, డ్రైనేజి కాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గొల్లవాణిగుంట కల్వర్ట్ వద్ద నీరు పొంగి పొర్లుతిన్నదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన అధికారులు సూచించారు. అనంతరం కేశవాయనగుంట ప్రధాన రహదారిపైకి మజ్జిగ కాలువ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు పొంగి ప్రవహించడంతో రోడ్డంతా మురికినీటితో నిండిపోయింది. దీనికి తోడు చెత్తను డ్రైనేజీ కాలువలో స్థానికులు వేస్తుండటంతో కాలువ పూడి నీరు పొంగుతోందని స్థానికులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆఫీసు టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నెంబర్లు: 9866239916, 9553161407. ఈఈలు తులసీరామ్, గోమతి, డిఈ రమణ, మహేష్ జనసేన నాయకులు రాజారెడ్డి, బాబ్జీ, భరత్, ఆనంద్, సుజీత్, దివాకర్ రెడ్డి, దినేష్, సులోచన, పాండురంగా, తెలుగుదేశం నాయకులు రామ యాదవ్, శ్రీహరి నాయుడు, చల్లా, నాని చౌదరి, మణి వర్మ, శంకర్ రెడ్డి, వేణుగోపాల్, పెంచులయ్య, వెంకటేష్ రాజు, శంకర్ నాయుడు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కపిలతీర్థంలో నేడు కాలభైవర హోమం

తిరుపతి, అక్టోబర్ 28ప్రభాతవార్త: కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా మంగళవారం నవగ్రహహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు హోమం, సహస్రనామార్చన, విశేషదీపారాధన జరిపించారు. ఈ కార్యక్రమా ల్లో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. బుధవారం కాలభైరవ హోమం జరగనుంది. గృహస్థ భక్తులు 500 రూపాయలు చెల్లించి హోమంలో పాల్గొనవచ్చు.